

ప్రపంచంలో కొన్నిచోట్ల అనావృష్టివల్ల ఎడారులు ఏర్పడితే మరికొన్నిచోట్ల అతివృష్టివల్ల వరదలువచ్చి, అనేకమంది జనులు బాధ పడుతున్నారు. ఈ అతివృష్టి మేఘాల్ని ఎడారులవైపు తోలేస్తే బాగుండునని అనిపిస్తుంది. కాని, ఆ విషయం సృష్టికర్త చెవిని వేసేందుకు ఎవరికీ శక్తిలేకపోవడంవల్ల, ఎడారులు అలాగే ఎండి పోతున్నాయి. సృష్టిలో ఇటువంటి లోపాలు చాలా ఉన్నాయి. ఒక వంక ఎదిగిన ఆడపిల్లలకు పెళ్ళి చెయ్యలేక, కొందరు తలిదండ్రులు బాధ పడుతూంటే, మరొకవైపు ముప్ఫైఏళ్లు వచ్చినా పెళ్ళి చేసుకోకుండా కాలం గడుపుతున్న బ్రహ్మచారు లున్నారు. అటువంటివాళ్లలో ఒకడు కేశవరావు.

రోజూ అయిష్టంగా, విసుక్కుంటూ, సహించని హోటల్ భోజనంతోనే సుమారు ఎనిమిదేళ్ల బట్టి కాలం గడుపుతున్నాడుగాని, అంతకన్నా రుచికరమైన భోజనంకోసం అతను ప్రయత్నం చెయ్యలేదు. అతను పనిచేసే ఆఫీసులో చాలా మంది అతని నొకయింటివాణ్ణి చేద్దామని చూశారుగాని, అసలా ప్రసక్తి వచ్చేసరికే, అతను తన గురించి అటువంటి అపోహ లేమీ పెట్టుకోవద్దనీ, తనసలు పెళ్లి చేసుకోననీ స్పష్టంగా చెప్పేసి, ఎదుటివారి కంతకన్నా ఎక్కువ మాట్లాడడాని కవకాశం ఇచ్చేవాడుకాదు.

కేశవరావు పెళ్ళి చేసుకోక పోవడానికి కారణాలేమిటా అని అతను పనిచేసే ఆఫీసులో, అతని తోటి ఉద్యోగస్తుల మధ్య చాలాసార్లు అతను లేనప్పుడు చర్చ జరిగింది. అతనిలో ఒక్కటి తప్ప, పెళ్ళి కొడుకుకి కావలసిన లక్షణాలన్నీ ఉన్నాయి. అందం ఉంది. అతను మంచి స్ఫురద్రూపి అని చెప్పవచ్చు. డబ్బువుంది. ఒక ఇల్లూ, పొలమూ కాక నెలకి మూడు వందలు ముట్టే మంచి ఉద్యోగం ఉంది. అతని తండ్రి చనిపోయి పదేళ్లయింది. తల్లి ఒక్కర్తే. పొలం ఉన్న పల్లెటూరులో ఉంది. అతనికి అన్న దమ్ములూ, అక్క చెల్లెళ్లూ ఎవరూ లేరు. ఇక ఆ ఒక్క లోపమూ ఏమిటంటే, పెళ్ళి చేసుకోవాలనే ఇచ్ఛ లేకపోవడం.

అలాగని కేశవరావు, నారీద్వేషి అనిగాని, స్త్రీ విముఖుడనిగాని అనలేం. అతనికి మంచి కళాపిపాసవుంది. చక్కని బొమ్మలు గీస్తాడు. మంచి మంచి కథలు రాస్తాడు. సౌందర్యాన్ని చక్కగా విమర్శిస్తాడు. సన్నిహిత స్నేహితులెప్పుడైనా ఈ ప్రశ్నను కదిపితే, తనకు వివాహం చేసుకోకూడదనే పట్టుదల ఏమీ లేదనీ, కాని ఇంతవరకూ తను ఒంటరితనంవల్ల బాధ పడడంగాని, ఏ స్త్రీనైనా చూసి మనస్సు చలించడంగాని జరగలేదనీ, అందువల్ల వివాహం అవసరమనే ఉద్దేశం తనకు కలుగలేదనీ, అందువలననే వివాహం చేసుకోవటం లేదనీ చెప్పాడు.

ఆ జవాబులో నిగూఢమైవున్న ఒక మనస్తత్వ రహస్యాన్ని, అతని స్నేహితుడైన మాధవరావు కనిపెట్టాడు. మాధవరావుది విశాఖపట్నం. అతను కూడా కేశవరావులాగే రైల్వే ఉద్యోగంచేస్తూ, ఖరగ్‌పూర్‌లో ఉంటున్నాడు. సుమారు ఏడాది నుండి ఇద్దరికీ ప్రాణ స్నేహం కలిసింది. మాధవరావుకి ఆపాతికేళ్లుంటాయి. ఇద్దరి అభిరుచుల లోనూ చాలావరకూ సారూప్యత ఉండడంవల్ల ఈ ఏడాది కాలంలోనూ వారి పరిచయం చాలా శీఘ్రంగా అభివృద్ధి చెందింది. మాధవరావు కనిపెట్టిన రహస్యమల్లా—కేశవరావును ఇంతవరకూ ఏ స్త్రీ కూడా కదిలించలేదనీ, అందువల్లనే అతడు వివాహానికి విముఖుడుగా ఉన్నాడనీ, అతనిని కదిలించే స్త్రీ తారసపడిననాడు అతను తప్పక వివాహం చేసుకుంటాడనీ. ఎటువంటి స్త్రీ కేశవరావును కదిలించగలదు? అన్న విషయం గురించి కేశవరావుయొక్క అభిప్రాయ మేమిటో తెలుసుకున్నాడు.

స్త్రీకి విద్య అవసరమనీ, స్త్రీలు కూడా పురుషులతో సరి సమానంగా ఉద్యోగం చేయాలనీ, కాని అంతమాత్రాన వారిలోని స్త్రీ సహజమైన లజ్జా, లావణ్యం మాత్రం కోలుపోక, ఇంటి పనులను శ్రద్ధగా చెయ్యడం, లలితకళల నభ్యసించడం, భర్త యెడల భక్తి ప్రపత్తులను కలిగి యుండడం మొదలైన లక్షణాలు ఉండాలని కేశవరావు చెప్తూండేవాడు. సరిగ్గా ఈ లక్షణాలన్నీ కలిగిన వ్యక్తి తారసిల్లిననాడు కేశవరావు వివాహం చేసుకుని తీరతాడనే నిర్ణయానికి మాధవరావు వచ్చాడు.

కొందరు తామొక విషయం కనిపెట్టే, "ఓహో!" అనుకుని వూరుకుంటారు. మరి కొందరు ఆ విషయంయొక్క పర్యవసానం ఏదో తేల్చడానికి చాలా తాపత్రయ పడతారు. మాధవరావుకి కేశవరావుని ఏదోవిధంగా ఒక ఇంటివాణ్ణి చెయ్యాలనే కాంక్ష పట్టుకుంది. అందుకు ఒక చిన్న పథకం కూడా ఆలోచించాడు. తద్వారా చాలా సమస్యలు పరిష్కారం అవుతాయనుకున్నాడు.

ఒకనాడు తన తండ్రివద్దనుంచి వచ్చిన ఉత్తరం పట్టుకుని మాధవరావు, కేశవరావువద్దకు వెళ్ళాడు.

"కేశవరావుగారూ మీరో సాయం నాకు చేసి తీరాలి" అన్నాడు గదిలోకి ప్రవేశిస్తూనే మాధవరావు.

"ఏమిటండీ అది?" అని ప్రశ్నించాడు కేశవరావు.

"మళ్లీ మా నాన్నగారివద్ద నుంచి ఉత్తరం వచ్చింది వెంటనే రమ్మని. ఒక మంచి సంబంధం చూశారట. నేను వెళ్లి పిల్లని చూసుకోవాలిట."

"అయితే వెళ్లండి."

"వెళ్లడం సులభమేకాని, ఆ సంబంధం చేసుకోనని మా నాన్నగారికి చెప్పడం ఎలాగ? నేను ఏమైనాసరే మా మేనత్త కూతురు కమలనేగాని

! ప్రశ్నతం.''

ంమ

వివాహం చేసుకోకూడదని నిశ్చయించుకున్నాను. అందుకు మా నాన్నగారు ఒప్పుకోరు.''

"గట్టిగా మీ నాన్నగారితో మీ మనస్సులోని విషయం చెప్పెయ్యా కూడదా?'' అన్నాడు ఈజీ ఛైరులో కూచుని సిగరెట్టు పొగ వదుల్తూ కేశవ రావు.

"ఆ ధైర్యం మా ఇంట్లో ఎవరికీలేదు. అందుకే నేను మీ సహాయం అర్థిస్తున్నాను. మీరు కూడా నాతో వచ్చి, మా నాన్నగారితో మాట్లాడి నా మనసులోని విషయానికి ఆయన్ను ఒప్పించాలి.''

"బాగుంది. మీ విషయంలో నేను కలుగజేసు కున్నందుకు ఆయనకు కోపం వస్తే?'' అని అడ్డు ప్రశ్న వేశాడు కేశవరావు.

"అలా కోపం రాకుండా చెప్పగల శక్తి మీలో వుంది. కాబట్టే మిమ్మల్ని నాతో రమ్మంటు న్నాను'' అన్నాడు మాధవరావు నవ్వుతూ. అతని పొగడ్తకు కేశవరావు కూడా నవ్వాడు.

"ఇంతకీ నే నిప్పుడు మీతో రావడానికి ఏదైనా కారణం, సందర్భం ఉండాలికదా?'' అన్నాడు కేశవ రావు.

"అందుకు తగిన కారణం నే నాలోచించాను. నే నిదివరలో చాలాసార్లు మన స్నేహం గురించి మా నాన్నగారికి రాశాను. అందువల్ల నేను వివాహం చేసుకోబోయే అమ్మాయిని నేనేగాక మా స్నేహి తులు కూడా చూడాలని రాశాను. అందువల్ల ప్రస్తుతం వాళ్లు ఏర్పాటు చేస్తున్న సంబంధం చూడడానికి నాతోపాటు మీరు కూడా రావడం సహజం'' అన్నాడు మాధవరావు.

మిత్రుడియొక్క ఈ విపరీతమైన కోర్కెను మొదట్లో నిరాకరించజూచినా, క్రమంగా మాధవ రావుయొక్క ప్రార్థనవల్లా, ఒత్తిడివల్లా, చివరకు అతనితో విశాఖపట్నం వాళ్లింటికి వెళ్ళడానికి ఒప్పుకున్నాడు కేశవరావు. తల్లితండ్రుల యెడల పుత్రులకు వినయ విధేయతలవసరమే కాని వివాహ విషయంలో అంత నిర్బంధం పనికిరాదనే, అభిప్రాయం కేశవరావుది. అయినా మాధవరావు తన తండ్రి మాటను ముఖాముఖీ ఖండించలేక, అందుకు తన సహాయం అర్థిస్తున్నాడని, కేశవ రావు గ్రహించాడు.

రెండు రోజులు గడిచాక, ఇద్దరూ ఆఫీసుకి సెలవుపెట్టి విశాఖపట్నం చేరుకున్నారు. దొండ పర్తిలో ఒక చిన్న డాబాముందు వారి జట్కా ఆగింది. ఇద్దరూ లోపలికి వెళ్ళగానే, హాలులో మాధవరావు తండ్రి దయానిధిగారు ఎదురుపడి పల్కరించారు. తన స్నేహితుణ్ణి పరిచయంచేసి మాధవరావు లోపలికి వెళ్లాడు. దయానిధి కేశవ రావుతో చాలా సరదాగా మాట్లాడుతూ, ఖరగ్ పూరు విశేషాలడుగ నారంభించారు. ఆయన చాలా సహృదయతగల మనిషిలా కన్పించారు. కేశవరావుకి. ఒక పావుగంటలో కాఫీ వచ్చింది. అంటే కాఫీ కప్పు తనముందు బల్లమీద ఉండడం మాత్రం గమనించాడు కేశవరావు.

"ఇదిగో ఈమె నా రెండవ కుమార్తె విమల. బి. ఏ. పాసయింది. అగ్రికల్చరల్ ఆఫీసులో పని చేస్తోంది'' అని దయానిధిగారు చెప్తూంటే, మెల్లిగా తలెత్తి చూశాడు కేశవరావు. "నమస్తే'' అంది విమల. ఆమెకు ఇరవై రెండేళ్లు ఉంటాయి సన్నగా, నాజూకుగా ఉంది. మొహం కొంచెం కోలగా ఉంటుంది. కళ్లు పెద్దవి. ఆమెవైపు ఒక్క క్షణం చూసి తల దించేసుకున్నాడు కేశవరావు. "నమస్తే'' అని ఆమెకు ప్రతి నమస్కారం చేశాడు.

దయానిధిగారు కేశవరావుని అతని స్వంత విషయాలడుగ నారంభించాడు. ఆయన లావు పాటి మనిషి. మొహం ఎర్రగా, బొద్దు మీసా లతో నెరిసిన జుట్టుతో గాంభీర్యాన్ని ప్రకటిం చినా, నిరంతరం చిన్న మందహాసం మెరుస్తూ, ఎదుటివారియందు స్నేహభావాన్ని ప్రకటిస్తూ వుంటుంది. విమల కాఫీ కప్పు టక్కడపెట్టివెళ్ళి పోయింది. మాధవరావువచ్చి, కేశవరావును స్నానం చెయ్యమని చెప్పాడు. కాఫీ త్రాగిన కేశవరావు స్నానానికి లేచాడు.

స్నానం, భోజనం ముగించుకొని మధ్యాహ్నం కాస్త విశ్రాంతికోసం హాలు ప్రక్కన గదిలో మిత్రులిద్దరూ మంచాలమీద నడుం వాల్చారు. కేశవరావుకు ఆ ఇంట్లో వారందరూ తనవొక ప్రత్యేక అభిమానంతో చూస్తున్నట్లనిపించింది. విమల మొహంలో తనని చూసినప్పుడల్లా చిన్న సిగ్గు తొంగిచూడడం, దయానిధిగారు తన గురించి, ఆస్తీ, ఉద్యోగాల వివరాలూ, తల్లితండ్రుల గురించీ అడగడం కేశవరావు మనసులో చిన్న అనుమానం మొలకెత్తింపజేసింది. ఒకవేళ తనను విమలకు తగిన వరుడిగా నిర్ణయించుకుంటున్నారేమో వీళ్లు? అసలు మాధవరావు తననదే ఉద్దేశంతో తీసుకు వచ్చాడేమో? కేశవరావు తనలో తను నవ్వుకున్నాడు. సాయంకాలం మాధవరావూ, కేశవరావూ సముద్రం వైపు షికారు వెళ్దామని బయల్దేరారు. మాధవరావు విమలను కూడా తమతో రమ్మన్నాడు. ముగ్గురూ సముద్రపు ఒడ్డున నడుస్తూ, చాలా దూరం వెళ్లారు. మొదట్లో ముగ్గురి మధ్యా సంభా షణ, బెరుకుగా నడిచినా, క్రమంగా ఉత్సాహ వంతంగా సాగింది.

సముద్రపు ఒడ్డున చాలా దూరం నడిచి ఒక ప్రశాంతమైన ప్రదేశంలో ముగ్గురూ ఇసుకలో కూర్చున్నారు. ఎదురుగా, ఒక దానివెంట ఒకటి తరుముకు వస్తున్న అలలు, వాటి వెనకాల గంభీ రంగా ఆకాశంలోకి వ్యాపించిన సముద్రాన్ని చూస్తూ ఉంటే, వారి మనసులు ఉల్లాసంతో ఉప్పొంగ నారంభించాయి. కేశవరావు సాధారణంగా ఆడవాళ్ల ఎదుట, స్వేచ్ఛగా మెసలలేడు. కాని విమల ఎదుట అతని కేమీ క్రొత్తనిపించలేదు. ఎందువల్లనంటే, ఆమెలో ఒక సరళత ఉంది. ఆమె కళ్లలో ఒక స్వచ్ఛ మైన స్నేహవాంఛ కన్పించింది. కేశవరావు అభి రుచులు, పాటలలోనూ, సినిమాలలోనూ, పుస్త కాలలోనూ సరిగ్గా విమల అభిరుచులతో ఏకీభ వించాయి. అలా ఏకీభవించాయన్న విషయం ఆమె ప్రత్యేకించి చెప్పలేదు. కానీ, ఆమె కళ్ళూ, ఆ కళ్లలో ఒక విధమైన మెరుపూ 'అవునవ్'పట్లు తలూపడం, ఆ విషయాన్ని స్పష్టం చేశాయి. కొద్ది సేపు సంభాషణ నడిచేసరికి, చాలా విషయాలలో విమల కెటువంటి అభిప్రాయాలున్నాయో, కేశవ రావుకి కూడా అవే అభిప్రాయాలున్నాయని తేలింది. ముఖ్యంగా వివాహ విషయంలో, విమల కూడా కేశవరావులాగే, వివాహం చేసుకోకుండా ఉందా మనే ఉద్దేశంతోనే ఉంది. దానికి కారణం ఆమెలో ఇంకా చదువుకోవాలనీ, జీవితంలో ఒక ఔన్నత్య పథాన్నందాలనీ, సాధారణ జీవితంతో తృప్తి పడ కూడదనీ, సహృదయతలేని పురుషులు, స్త్రీల అభివృద్ధి కాటంకం కలిగిస్తారనీ, మొదలైన అనేక భావాలు. వాటిని కేశవరావు తెలుసుకున్నాక, ఆమె యందతనికి చాలా గౌరవం కలిగింది.

ఆ సాయంకాలమంతా వారి ముగ్గురి మధ్యా అనేక సాధారణ విషయాలమీద చర్చ జరిగింది. రాత్రి 7 గంటలు దాటాక మళ్లీ ముగ్గురూ కొంతదూరం సముద్రాన్ని చూసుకుంటూ, తరు వాత వూరిలోకి నడవసాగారు.

"ఆలస్యం అమృతం..."

ఇంటికి వచ్చాక దయానిధిగారు మాధవరావుతో "రామారావుగారు ఇంతవరకూ నీ కోసం ఎదురు చూసి, ఇప్పుడే వెళ్ళిపోయారురా" అన్నారు.

"రామారావుగారు ఎవరు?" అనడిగాడు మాధవ రావు.

"నువ్వు చూడబోయేది ఆయన కూతుర్నేనూ" అని జవాబిచ్చారు దయానిధిగారు. మాధవరావు, "ఓహో!" అని కేశవరావువైపు చూసి చిరునవ్వు నవ్వాడు. కేశవరావు 'కానీ' అన్నట్లు తలపంకించాడు. దయానిధిగారు మర్నాడు ప్రొద్దున్న పది గంటలకు పెళ్ళి చూపులు ఏర్పాటు చేయబడ్డాయని చెప్పారు.

కేశవరావూ, మాధవరావూ తమలో తాము సంప్రదించుకుని ఒక నిర్ణయానికి వచ్చారు. అదేమిటంటే పెళ్ళి చూపులయ్యాక 'పిల్ల నచ్చిందా?' అని దయానిధిగారడిగినప్పుడు మాధవరావు తనకు పిల్ల నచ్చలేదని చెప్పి, అప్పుడు తనకు తన మేనత్త కూతురు కమలనే చేసుకోవాలనుందని తన మనోరథాన్ని బయటపెట్టి, కేశవరావు సహాయంతో దయానిధిగారిని ఒప్పించాలని.

ఆ రాత్రి భోజనాలయి, పక్కమీదకు చేరిన కేశవరావుకు చాలాసేపు నిద్ర పట్ట లేదు. 'విమల' గురించిన ఆలోచనలు క్రమంగా అతని మనసునాక్రమించాయి. తననింతవరకూ ఏ స్త్రీ కూడా ఆకర్షించలేదు. ప్రొద్దున్న విమలను చూసినప్పుడు కూడా తనలో ఏ చలనమూ కలుగలేదు. కానీ సాయంకాలం సముద్రపు ఒడ్డున్న ఆమె కళ్లలోని అందం తన హృదయాన్నాక్రమించుకుంది. ఆమెలో ఏదో ఒక శక్తి తనలో అంతవరకూ మేల్కొనని ప్రణయ వాంఛల నుద్దీపింపజేసింది ఆమెది విశాల హృదయమనీ, చక్కని మనసనీ తెలుస్తోంది. తననసలు ఆమె వరిస్తుందా? అన్న సందేహం కూడా కలిగినా, కేశవరావు మనసులో ఆమె రూపం కదలాడి, తను ఎప్పటికైనా వివాహం చేసుకుంటే ఆమెనే చేసుకోవాలనే నిర్ణయానికి వచ్చాడతను. కాని ఆ విషయం ఎలా కదపాలా? ఆమె మనసు తెలుసుకోవడ మెలాగా? అని చాలాసేపు ఆలోచించాడు.

మన పురాణాలన్నీ నిజం కావని కొందరు ఆధునికులు వాదించి, అసలు దేవతలు లేరని కూడా అనచ్చు. కడంవాళ్ల సంగతి ఎలాగున్నా, 'మన్మధుడి' గురించి మట్టుకు ఆధునికులకు అంత తెలియదనే చెప్పాలి. అతని బాణాల మహత్యం, చవిచూచిన వాడికేగాని పైవాళ్లకు తెలియదు. ఒక వంక కేశవరావు, విమల గురించి ఆలోచించి క్రమంగా ప్రేమికుడి స్థితికి —వస్తూంటే, అదే ఇంట్లో మరొక గదిలో మంచంపైన దొర్లుతూ నిద్ర పట్టక విమల కూడా అదే అవస్థ ననుభవిస్తోంది. ఆమె మనస్సంతా కేశవరావుతో నిండి పోయింది. ఎందుకోగాని అతనిలో ఒక ప్రత్యేక సహృదయత ఆమెకు కన్పించింది. ఆమెకు నచ్చిన రూపమేకాక, ఆమె నాకర్షించిన ప్రశాంతత వుంది. అతనివి తెలివైన అభిప్రాయాలు. అతను మాట్లాడుతూంటే తన మనోభావాల్ని, ఎవరో పైకి వెల్లడిస్తున్నట్లుంది. ఇంతా చేస్తే, అతనితో పరిచయం కొద్దిసేపు మాత్రమే. అయినా సరే—ఆ సముద్రపు టొడ్డున ఇసుక తిప్పల్లో కూచొని సంభాషణలో మైమరిచి, తన హృదయమే అతని వద్దకు వెళ్ళిపోయిందన్న విషయం గమనించలేకపోయింది కాని—అతనే గనక ఇష్టపడితే, అతనితో వివా....."ఛ! నోర్మూయ్" అంది ఆమె మనసు, హృదయంతో! గబుక్కున తలగడా మొహంమీదికి లాక్కుంది విమల!

ఇలా మన్మధుడు రాత్రల్లా వాళ్లిద్దర్నీ అల్లరి పెట్టి, తెల్లవారుజామున మధుర స్వప్నాలలో కొద్దిసేపు నిద్ర పోయేటట్లుచేసి, తెల్లవారకుండా లేపేశాడు. మర్నాడు ప్రొద్దున్న లేచిన దగ్గర్నుంచీ విమలకోసం కేశవరావు కళ్లు ఎదురు చూడసాగాయి. అతని మర్యాదల విషయంలో విమల ప్రత్యేక శ్రద్ధ వహించింది.

మాధవరావు కొద్దిగా ఆలస్యంగా లేచినా, కాఫీ త్రాగడం అయ్యాక అతని బుర్ర వేగంగా పని చెయ్య నారంభించింది. కేశవరావు మొహంలోని కొత్త ఉత్సాహం అతను పసిగట్టాడు.

ప్రొద్దున్న పది గంటలకు మాధవరావూ, కేశవరావూ పెళ్ళి చూపులకు బయల్దేరారు. తక్కిన వారంతా అంతకుముందే ఆ పిల్లనుచూసి ఉన్నారు కాబట్టి, వారు వెళ్లలేదు. పెళ్ళికూతురు తండ్రి పేరు రామారావుగారు. ఆయన కొద్దిగా స్థితిపరుడు. ఆయనకు ఒక్కర్తే ఆడపిల్ల. నలుగు రబ్బాయిలు. అయిదారువేల దాకా కట్నం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారు. మాధవరావు తల్లి తండ్రులు ఆ కట్నాని కాశపడి ఈ పెళ్ళి చేసుకోమని మాధవరావుని బలవంతం చేస్తున్నారు. ఆ కట్నంతో విమల పెళ్ళి అయిందనిపిద్దామని వారి తాపత్రయం.

డాబా తోటలోవున్న ఒక మేడలో రామారావుగా రుంటున్నారు. ఆయన తనకున్న భూవసతిలో కొంత భూమిని అమ్మి వ్యాపారం చేస్తున్నారు. అది అంతగా కలిసి రాలేదు. ఆయన కొంతవరకూ అమాయకుడనే చెప్పాలి. మనుష్యుల్ని సులభంగా నమ్ముతాడు. అందువల్ల వ్యాపారం దెబ్బతింది. కొంత డబ్బు నష్టపోగా, చేతిలో పదివేలు మిగిలింది. దానితో కూతురిపెళ్ళి చెయ్యాలని ఆయన కోరిక.

మాధవరావు పెళ్ళి కూతుర్నంత పరీక్షగా చూడలేదు. కాని, మొత్తంమీద చక్కనిపిల్లేనని గ్రహించాడు. ఆమె. పి. యూ. సి. చదువుతోంది. కేశవరావు నిదానంగా ఆమెను చూసాడు. ఆమెలో అతని కేలోపమూ కన్పించలేదు. రామారావుగారు, తన కూతురి తెలివి తేటల గురించీ, పనులలో నేర్పు గురించీ చెప్పారు. ఒక పావుగంట గడిచాక, మాధవరావు. కేశవరావు లిద్దరూ ఆయనవద్ద సెలవు పుచ్చుకుని తిరిగి వచ్చేసారు. దారిలో ఇద్దరూ నవ్వుకున్నారు.

"మనం వచ్చిన పని సగమైంది" అన్నాడు కేశవ రావు.

"ఇంకా సగం వుంది" అన్నాడు మాధవరావు.

ఇంటికి రాగానే మాధవరావుని దయానిధిగారు, "పిల్ల ఎలా ఉంది?" అని అడిగారు. "బాగు లేదు" అని తలవంచుకుని లోపలికి వెళ్ళిపోయాడు మాధవరావు. దయానిధిగారు చిన్నబుచ్చుకున్నారు. "ఇహ మీ పెళ్లిళ్లు చెయ్యడం నా వల్లకాదు" అన్నా రాయన కోపంగా, తుఫాన్ చెలరేగిన మనఃస్థితిలో.

కేశవరావు ఆయన కెదురుగా కూర్చున్నాడు. "పిల్ల కేమండీ. లక్షణంగా ఉంది" అన్నాడు. దయానిధిగారతని వైపు తిరిగి, "మరి వాడల్లా అంటున్నాడే?" అని అడిగాడు.

"అబ్బే. అది పిల్లలోపం కాదు. అతని లోపం. అతనికి ఇంతకుముందే మరొక పిల్ల నచ్చింది. అందువల్ల ఈ పిల్ల నచ్చలేదు."

"ఏమిటీ? మరొక పిల్ల నచ్చిందా? ఎవరా పిల్ల?"

"అతని మేనత్త కూతురు కమలట."

"ఆ!" అని ఆశ్చర్యపోయారు దయానిధిగారు. ఉప్పొంగి వస్తున్న కోపాన్నాపుకుంటూ, "కమలనా? పిడా?" అని అరిచాడు.

"మీరలా కోపం తెచ్చుకోకుండా ఉంటే, నేను రెండు ముక్కలు చెబుతాను వినండి. మీ అబ్బాయి కమలను ప్రేమించిన సంగతి మీకు తెలిస్తే మీరు కోప్పడతారని అతను చాలా భయపడుతున్నాడు. అసలిక్కడికి రానసీ, తనకు కమల ఎలాగా దక్కదు కాబట్టి జీవితం అంటే తనకు విరక్తి పుట్టిందనీ, ఆత్మహత్య చేసుకుంటాననీ, ఒకనాడు రాత్రి పటో



బెట్టాడు. అప్పుడు నేనతనికి ఎన్నో విధాల నచ్చచెప్పి, 'నీ కన్న తండ్రి ఎప్పటికైనా నీ మేలే కోరుతారు, భయపడవద్ద'ని చెప్పి, అతనిని తీసుకు వచ్చాను. తెలివితక్కువనుకోండి, ఉద్రేక మనుకోండి, పసితనమనుకోండి. ఎంతైనా అతను మీ అబ్బాయి. అతను సుఖంగా ఉండడమే మీకు కావాలి. అతను బాధ పడ్తే మీకేం లాభం?''

దయానిధిగారు క్రమంగా మెత్తబడ్డారు. కేశవరావు మాటలు ఆయనకు సబబుగానే తోచాయి

"ఆలస్యం అమృతం..."

కాని, అంతలో మంచి కట్నంతో వచ్చిన సంబంధం వద్దంటున్నాడని కొడుకుమీద ఆయనకు కోపం వచ్చింది. ''చూడండీ, మీరన్నది నిజమే. వాడి మేనత్త కూతుర్ని వాడు వరించచ్చు. కాని వాళ్ళకు దమ్మిడీ ఆస్తి లేదు. కట్నం అసలివ్వలేరు. నేను విమలకు పెళ్ళి చెయ్యాలి. వీడీ సంబంధానికి ఒప్పుకుంటాడేమో, ఆ కట్నంతో దాని పెళ్ళి చేద్దా మనుకున్నాను. కాని వీడా కమల్ని పెళ్ళి చేసుకుంటే, ఏం డబ్బొస్తుంది? నేనేమీ భాగ్యవంతుణ్ణి కాను'' అని ఆయన అంటూంటే గుమ్మం ప్రక్కగా నిల్చుని వింటున్న విమల మనస్సుడికిపోయింది. తనసలు పెళ్ళి చేసుకోనని చెబ్దా మనుకుంది. కానీ, తానేమీ అనకుండా, కేశవరావు, ''పోనీ, విమలను కట్నం లేకుండా పెళ్ళి చేసుకోవడానికి ఒక యువకుడు అంగీకరిస్తే మీ సమస్య తీరినట్లేనా?'' అన్నాడు.

''అలా అయితే ఫరవాలేదు'' అన్నారు దయానిధిగారు. వారిద్దరి మాటలు వింటున్న విమల మనసులో ఆత్రుతా, ఆనందం ఆవరించాయి.

''మీ కభ్యంతరం లేకపోతే నేను ఆమెను వివాహం చేసుకుంటాను'' అన్నాడు కేశవరావు. గుమ్మం ప్రక్కన నిల్చున్న విమల వంటింట్లోకి పరుగు తీసింది. దయానిధిగారి మొహం వికసించింది.

అప్పుడే ముందుగదిలోకి వస్తున్న మాధవరావు, ''కంగ్రాట్యులేషన్స్ కేశవరావుగారూ!'' అన్నాడు నవ్వుతూ. దయానిధిగారు ఈ విషయాన్ని భార్యతో చెప్పడానికి లోపలికి వెళ్ళారు.

''ఇప్పుడు మీ వివాహానికి అడ్డు లేదు'' అన్నాడు కేశవరావు మాధవరావుతో. తనకోసం ఎంతో శ్రమ తీసుకుని తన తరఫున వాదించినందుకు, కాబోయే బావగారిని విపరీతంగా అభినందించాడు మాధవరావు.

ఆరోజు సాయంకాలం మళ్ళీ ముగ్గురూ షికారుకి బయల్దేరారు. ఆ ఘడియలు ఎలా గడిచాయో వారికే తెలియదు. విమలా, కేశవరావులకు తమ చుట్టూ వున్న ప్రపంచం కొత్తగా కన్పించ సాగింది. సముద్రపు టొడ్డున ముగ్గురూ కూచుని మాట్లాడుకుంటూండగా మాధవరావు తనకు వూళ్ళోపనుందని, మళ్ళీ కొద్ది సేపట్లో వస్తాననీ చెప్పి వెళ్ళాడు. తమకు లభించిన ఏకాంతంలో కేశవరావూ, విమలా స్వేచ్ఛగా మాట్లాడుకో నారంభించారు. తను విమల మనస్సును తెలుసుకోకుండా తొందర పడ్డానేమో అని భయపడ్డ కేశవరావు విమలను ఆమె హృదయాన్ని విప్పి చెప్పమని అడిగాడు. ఆమె తనకెట్టి అభ్యంతరమూ లేదని తెలియజేసింది. ఇద్దరూ ఇంత త్వరగా ఒకరి నొకరు అర్థం చేసుకున్నందుకు ఆశ్చర్యానందాలు వెలిబుచ్చుకున్నారు. కేశవరావు తను ఇంత కాలం, విమలవంటి స్త్రీని చూడ గలుగుతానని అనుకోలేదనీ, ఆమెను చూశాక, తానొక నూత్నానుభవాన్ని పొందానని చెప్పాడు. విమల తన మనసులోని భావాలన్నిటినీ మాటలతో చెప్పలేకపోయినా, ఆమె కళ్ళు మాత్రం, ఆమె మనసుని పూర్తిగా కేశవరావుకి చెప్పేశాయి. వారి హృదయాలలోని విషయాలు చెప్పుకోవడానికి, అటువంటి సాయంకాలాలెన్నున్నా చాలవనిపించింది. వాటిని భవిష్యత్తుకు వాయిదావేసి, మాధవరావు రాగానే ఇద్దరూ లేచారు. ఇంటికి వెళ్ళడానికి.

మర్నాడు కేశవరావు, దయానిధిగారితో, తను తన తల్లి వద్దకు వెళ్ళి ఈ విషయం చెప్పివస్తాననీ, ఆమెతో మాట్లాడాక వివాహానికి ముహూర్తం నిశ్చయించవచ్చుననీ చెప్పాడు. దయానిధిగారు వీలైనంత తొందరలో విమల వివాహం జరగాలనీ, కేశవరావుని అందుకు తగిన ప్రయత్నాలన్నీ చెయ్య

మీకు నిజంగా మంచి టీ కావలెనంటే-కొనండి



కమ్మని రుచిగలిగినది మరియు, ప్రతి ప్యాకెట్ లోనుంచి ఎక్కువ కప్పులు టీ తయారగును ముడిస్ టీ త్రాగండి - సొమ్మును ఆదాచేసుకోండి

మనీ చెప్పారు. ఆరోజు మధ్యాహ్నమే బయల్దేరి కేశవరావు తన తల్లివున్న రాజుపేట అనే పల్లెటూరు వెళ్ళాడు. ఆ వూరు విశాఖపట్టణానికి ముప్పై మైళ్ళ దూరంలో ఉంది. అతను సాధారణంగా ఏడాదికి ఒకసారో రెండుసార్లో ఆ వూరు వెళ్తాడు అతను వెళ్ళినప్పుడల్లా అతని తల్లి, లతనిని వివాహం చేసుకోమని వేధిస్తుంది. ఆమె పూర్వాచార పరాయణురాలు. కేశవరావు ప్రతి సారీ తన తల్లితో తను వివాహం చేసుకోదల్చుకోలేదని చెప్తుండేవాడు. ఆమె చాలా బాధ పడేది.

ఈసారి తను వివాహం చేసుకోబోతున్నానని చెప్తే తన తల్లి తప్పక సంతోషిస్తుం దనుకున్నాడు. అతను చెప్పబోయే మాట అతని నోటినుంచి వెలువడకుండానే ఆమె ప్రారంభించింది. ఆమెకు ఏభై ఏళ్ళు దాటాయి. నెరసిన తలతో, నల్లగా ఉండే ఆమె మొహం, కొడుకు వివాహం గురించిన దిగులుతో ముడతలు పడినట్లు, చూసేవారికి ఆమె విచారంగా ఉన్నట్లు కన్పిస్తుంది.

"నిన్ను నే నొక కోరిక కోరుతున్నారా నాయనా తల్లిని కాబట్టి ఆమాత్రం కోరడంలో తప్పేమీ లేదనుకుంటాను. నువ్వా కోరిక తీరుస్తానని టివ్వాలి" అందామె.

తన వివాహం గురించే ఆమె కోరుతుందని కేశవరావుకు తెలుసు "అలాగేనమ్మా నీ కోరిక తప్పక తీరుస్తా. నేనూ వివాహం చేసుకుంటాననే చెప్పడానికి వచ్చాను" అన్నాడు.

ఆమె మొహం వికసించింది. "ఎన్నాళ్లకు విన్నానురా నీ నోట ఈ మాట! నీకు తగిన సంబంధం సిద్ధంగా ఉంది. పిల్ల బంగారపు బొమ్మలా ఉంది, చదువుకుంటోంది కూడాను. ఇవాళ ప్రొద్దున్నే వాళ్లకు మాటిచ్చాను" అందావిడ సంతోషంతో.

కేశవరావు తుళ్ళిపడ్డాడు. "మాటా! ఎవరికి?" అన్నాడు ఆశ్చర్యంతోనూ, భయంతోనూ.

"మనవాళ్లే. నాకు వరుసకు అన్నవుతాడు. విశాఖపట్నంలో డాబా తోటలో ఉంటున్నారు రామారావని. ఆయన కూతురు పి. యూ. సి. చదువుతోంది. మీ ఇద్దరికి వయసులో తేడా ఎక్కువే అయినా పిల్ల ఏపరిగా బాగుంది. ఇవాళ ప్రొద్దున్న వాళ్ళు మనింటికి వచ్చారు. కూతుర్ని తీసుకొచ్చి నా కాళ్ళమీద పడేశాడు. దాని బాధ్యత నాదేనని. ఎంతో బ్రతిమాలాడు. అతని స్థితి చూసి జాలివేసి మాటిచ్చాను. తప్పకుండా నా కోడల్ని చేసుకుంటానని. నా మాట నిలబెట్తావని నీమీద నాకు ధైర్యం ఉంది."

కేశవరావుకి భూమి తల్లక్రిందులయింది. ఇది నిజమేనా? కలా? రామారావుగారి అమ్మాయిని తను వివాహం చేసుకోవాలా? అందుకు తన తల్లి మాటిచ్చిందా? తను తల్లి మాటని కాదంటాడా? లేక విమలను నిరాకరిస్తాడా? ఇటు తనను కని, పెంచి పోషించి తనమీదే ఆశలన్నీ పెట్టుకున్న తల్లిని కాదంటాడా? అటు తన హృదయాన్నపహరించిన విమలను కాదంటాడా? అసలు దయానిధిగారికి తనిచ్చిన వాగ్దానం సంగతేమిటి?

ఆలోచనలన్నీ ఒక్కసారి మనసు నావరించుకొని అతనికి ఆలోచించే శక్తిని కూడా లేకుండా చేశాయి. తన జవాబుకోసం ఎదురు చూస్తున్న తల్లివైపు చూసి, "నన్నడక్కుండా మాటెందుకిచ్చావమ్మా?" అన్నాడు, బాధగా.

"నేనన్నీ ఆలోచించి, నీ సుఖం కోరే చేశానురా. నా మాట వినినందుకు నువ్వెప్పటికీ విచారించవు" అందామె కొడుకుయందు తనకుగల వాత్సల్యాన్ని వ్యక్తపరుస్తూ.

తన మనసులోని విషయం ఆమెతో చెప్పలేదు. ఎలాగో ఆ రాత్రి అక్కడ గడిపి, ప్రొద్దున్నే ఖరగ్‌పూర్ బయల్దేరాడు కేశవరావు. అతను వెళ్లే ముందర, తల్లి మళ్లీ కదిపింది. "ముహూర్తం వెంటనే పెట్టిస్తానురా" అంది.

కేశవరావు మెల్లిగా ఆలోచిస్తూ, "రెండు మూడు నెలలు వ్యవధి కావాలమ్మా. నేనుత్తరం రాస్తాను. తరువాత పెట్టిద్దువుకాని" అన్నాడు. ఆమె అలాగేనంది. తను చెప్పిన విషయం గురించి కొడుకు అంత ఉత్సాహంగా లేడని ఆమె గ్రహించింది. కాని, కారణం వూహించలేకపోయింది.

తిన్నగా ఖరగ్‌పూర్ చేరుకున్న కేశవరావుకి వారం రోజులవరకూ ఏమీ తోచలేదు. పెళ్ళి చేసుకోకూడ దనుకున్నంత కాలం జీవితం సాఫీగా గడిచింది. పెళ్ళి చేసుకుందామనుకోగానే అనుకోని సమస్య లెదురయ్యాయి. తల్లి మాటను తోసి వెయ్యడం అతనివల్లకాదు. ఆమె తనయందు పూర్ణ విశ్వాసంతో వాగ్దాన మిచ్చింది. కాని, తన హృదయం విమలకు దూరమై, బ్రతికేకంటే జీవితాన్ని త్యజించడమే మేలనిపిస్తోంది. అతను పిరికివాడై, జీవితంనుండి పారిపోదామనుకోడంలేదు

మాష్టారు : రైలు లేటుగా వచ్చును ఇదే కాలంరా.

రాము : తద్ధర్మ కాలం సార్ !

రామయ్య (ఏలూరు)

కానీ అతనిని మించిన సమస్యలతని కెదురయ్యాయి. తను త్యాగం చెయ్యగలడు—తల్లి కోసం, కాని, విమల సంగతి? ఆమెకు తను ద్రోహం చేసినట్లు కాదూ?

మాధవరావు, విశాఖపట్టణంలో వారం రోజుల దాకా ఉండి, కేశవరావు మళ్ళీ తమ ఇంటికి రాకపోయేసరికి, తిన్నగా ఖరగ్‌పూర్ వచ్చేశాడు. వచ్చిన వెంటనే అతను వాకబు చేస్తే తెలిసిందేమిటంటే కేశవరావు ఆఫీసుకి సెలవుపెట్టి వూళ్లోనే ఉంటున్నాడని. అతని రూముకి సాయంకాలం మాధవరావు వెళ్తే, రూము తాళం వేసుంది.

వరుసగా మూడు రోజులు ప్రొద్దున్నా, సాయంకాలం అతని గురించి తిరగ్గా మాధవరావుకి, ఒకనాటి రాత్రి ఎనిమిది గంటలకు రూములో దొరికాడు కేశవరావు. మాసిన గడ్డంతో, చిక్కి దిగులుగా ఉన్న అతన్ని చూసేసరికి మాధవరావుకి బాధా, ఆశ్చర్యం కలిగాయి. కేశవరావు అతనితో మునపటిలా మాట్లాడలేదు. తన మనసు బాగులేదనీ, తన సహార్యం చేసుకోవద్దనీ మాధవరావుతో చెప్పాడు. కేశవరావు ఏదో పెద్ద 'షాకు' తిన్నాడనీ, దాని నుండి తేరుకునే దాకా అతనితో వివాహవిషయం మాట్లాడ కూడదనీ మాధవరావు అనుకున్నాడు.

పదిహేను రోజులు గడిచాయి కేశవరావు, స్నేహితులతో మునపటిలా తిరగడం మానేశాడు. మాధవరావుని తప్పించుకు తిరుగుతున్నాడు. అతని విషయం తన తల్లి దండ్రులకు మాధవరావు వ్రాసి, వారిని ఖంగారు పడవద్దనీ, కొద్ది రోజులలో అసలు విషయమేమిటో కనుక్కొని వ్రాస్తానని వ్రాసాడు. ఏదో సంఘటన అనుకోనిది జరగడంవల్ల కేశవరావు చాలా మనఃక్లేశాన్ననుభవిస్తున్నాడనీ అందువలన కొద్ది రోజులు ఓపిక పట్టమని మాధవరావు దయానిధిగారికి వ్రాశాడు.

మరొక పదిహేను రోజులు గడిచాయి. కేశవరావు ఆలోచించి, ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చాడు. ఇహ తను ఇలా ప్రవర్తించడం సబబు కాదు. జరిగినదంతా మాధవరావుకి తెలియబర్చాలి. విమల తన నొక నీచుడిగా భావించవచ్చు. ఇటు తన తల్లినీ తృప్తి పరచలేడు తను. అందుకని ఎప్పటిలాగే తను వివాహం చేసుకోకుండా ఉండడమే మంచిదనుకున్నాడు.

బరువైన హృదయంతో ఆ రోజు సాయంకాలం బయల్దేరి మాధవరావు రూమువద్దకు వెళ్లాడు కేశవరావు. తన సుఖానికీ, ప్రేమకూ ఆ క్షణంతో అంతిమ వీడ్కో లివ్వదల్చుకున్నాడు. విమలతో, తనను మర్చిపొమ్మని చెప్పమని చెప్దామనుకున్నాడు. తన స్థితికి లోకం పరిహసిస్తుందనుకుని, మూసివున్నమాధవరావు రూము తలుపులూ, వాటికి వేసిన తాళం చూశాడు. ప్రక్క వారిని కనుక్కోగా, నాల్గు రోజుల క్రితమే మాధవరావు విశాఖపట్టణం వెళ్ళిపోయాడని చెప్పారు. వికలమైన మనసుతో తిరిగి పోయాడు కేశవరావు.

మరునాడు తన రూములో కూర్చుని వివరంగా దయానిధిగారిపేర ఒక ఉత్తరం రాయడం ప్రారంభించాడు కేశవరావు. అందులో తన తల్లి రామారావుగారి కిచ్చిన వాగ్దానం వల్ల పరిస్థితు లెలా తారుమారయినదీ వివరించ సాగాడు. చివరికి తను వివాహం చేసుకోకూడదనే నిశ్చయానికి వచ్చిన సంగతి రాస్తుంటే "సార్!" అన్న కేక విన్పించింది. పోస్టుమాన్ ఒక శుభలేఖిచ్చాడు.

ఆ శుభలేఖను చూసి నిర్ఘాంతపోయాడు కేశవరావు. అది మాధవరావుయొక్క పెళ్ళి శుభలేఖ! మాధవరావుకీ, రామారావుగా రమ్మాయి సంధ్యారాణికీ వివాహం! కేశవరావు ముందర నమ్మలేకపోయాడు. ఇది ఎలా సంభవమా? అని ఆలోచించాడు. కొద్ది సేపాలోచించాక అతని కొక ఆలోచన తట్టింది. బహుశా మాధవరావు తన కోసం చేస్తున్న త్యాగమేమో ఇది! తన చెల్లెలి సుఖ కోసం, తను వివాహం చేసుకోదల్చిన కమల మానేసి, మాధవరావు ఈ అమ్మాయిని వివాహ చేసుకుంటున్నాడా? మరి రామారావుగారు త కూతుర్ని ఎలా అతని కిస్తున్నారు? తన తల్లికి ఇచ్చి మాటేమయింది? పెళ్ళికి సరిగ్గా మూడు రోజు వ్యవధివుంది. కేశవరావు వెంటనే వాల్తేరు బ ల్దేరాడు.

వాల్తేరులో దయానిధిగారింటి వద్ద జటా లోంచి దిగిన కేశవరావుకి, దయానిధిగా రెదు పడి, "రావోయ్! నీ కోసమే చూస్తున్నాం" లోపలికి తీసుకెళ్ళారు. మాధవరావు అతనిని చ "మీతో మాట్లాడాలి, రండి" అని ఒక గదిలో తీసికెళ్ళాడు. "శుభలేఖ అందిందా?" అని

గాడు మాధవరావు, కేశవరావుని.

"అందుకే వచ్చాను. నాకోసం మీ రిలా చెయ్యడం బాగులేదు. నన్ను మీరంతా క్షమించి........'' అని కేశవరావు ఏదో అనబోతూంటే, మాధవరావు, "మీకోసం నేనేమీ చెయ్యటం లేదు'' అన్నాడు.

"మరి ఈ వివాహం మీ రెందుకు చేసుకోవాలి? మీ హృదయం, మీ మేనత్త కూతురి కర్పిత మైనప్పుడు మీ రామెను మాని, ఈ వివాహం చేసుకోడం, మా కోసం కాదా?''

"నేను, కమల విషయంలో నా మనసు మార్చుకున్న పరిస్థితి తరువాత చెప్తాను. కాని ఈ వివా

"ఆలస్యం అమృతం..."

హం నేను చేసుకోవడంలో మీకోసం చేసిన దేమిటో నాకు బోధపడటంలేదు'' అన్నాడు మాధవరావు.

"మీరంటున్నది నిజమేనా? మీ కేమీ తెలియదా?'' అని కేశవరావు అడిగాడు. మాధవరావు తన కేమీ తెలియదని చెప్పాక, కేశవరావు సవిస్తరంగా జరిగినదంతా చెప్పాడు. అది విని మాధవరావు, "చిత్రంగావుంది. అయితే ఇందుకేనా మీరా విధంగా దిగులు పడింది?'' అనడిగాడు.

"అవును. ఇప్పుడు మీరీ వివాహం కెందుకు ఒప్పుకున్నారో చెప్పండి?'' అనడిగాడు కేశవరావు.

"ఇదీ కారణం'' అని ఒక ఉత్తరాన్ని మాధవరావు తన పెట్టెలోంచి తీసి, కేశవరావు కిచ్చాడు. అది, కమల, మాధవరావుకి రాసిన ఉత్తరం. 'బావా! నన్ను నువ్వమితంగా ప్రేమిస్తున్నావని నాకు తెలుసు. నీ హృదయంలో ఈ ఉత్తరంతో ఎంత చిచ్చును రగుల్కొల్పుతున్నానో, నేనూహించగలను. కానీ, ఇంకా నీ దగ్గర విషయాలు దాచి, నిన్ను మభ్యపరచి, చివరకు నిన్ను మోసం చెయ్యడం కన్నా అసలు విషయం ముందే చెప్పడం మంచిది. నేను నా క్లాసు మేటయిన శ్రీహరిగారిని వివాహ మాడదల్చుకున్నాను. ఆయనకూ, నాకూ సుమారు సంవత్సరంనుండి స్నేహం ప్రారంభమై, అది అనుకోని పరిణామాలకు దారి తీసింది. నువ్వీ ఉత్తరం చదివే వేళకు, మే మిద్దరం రిజిస్ట్రాఫీసు వదలి వస్తూంటాం. నన్ను క్షమించమని కోరే అర్హత నాకు లేదని తెలుసు. కమల' అని ఉన్న ఉత్తరం చూసి కేశవరావు చాలా నొచ్చుకున్నాడు.

"ఈ ఉత్తరం నేను ఖరగ్‌పూర్‌లో ఉండగానే అందింది. వెంటనే వాల్తేరు వచ్చి జరిగిందంతా నాన్నగారికి చెప్పి, నాకు ఇక ఏ సంబంధమైనా చేసుకోవడానికి అభ్యంతరం లేదని చెప్పాను. ఆయన వెంటనే రామారావుగారిని కలుసుకుని ఈ వివాహం ఏర్పాటు చేశారు. మరి మీ సంగతి ఆయనేమీ చెప్పలేదు.''

"తక్కినది నేను చెప్తాను విను'' అన్నారు అంతకుముందే ఆ గదిలోకి ప్రవేశించిన దయానిధిగారు. "రామారావుగారు నాతో నీ విషయం చెప్పారు. అప్పుడు నువ్వు విమలను చేసుకుంటానన్న విషయం చెప్పాను. అప్పు డాయనా నేనూ రాజుపేట వెళ్ళి మీ తల్లిగారిచేత, నువ్వు విమలను చేసుకునేందుకు ఒప్పించాము. మా వాడికి రామారావుగారమ్మాయితో వివాహం నిశ్చయ పరిచాం. ఈ పెళ్ళికి మీ అమ్మగారు కూడా వస్తామన్నారు'' అన్నా రాయన కేశవరావుతో.

ఇంతలో వారి ఇంటిముందు జట్కా ఆగింది. అందులోంచి కేశవరావు, తల్లి దిగింది. దయానిధిగారూ, మాధవరావూ, కేశవరావూ, ఆమె కెదురుగా వెళ్లి లోపలికి తీసుకు వచ్చారు. ఆమె లోపలి వస్తూనే "ఏదీ నా కోడలు?'' అని అడిగింది.

దయానిధిగారి భార్య విమలను తీసుకువచ్చి చూపించింది. ఆమె విమలను చూసి, చాలా సంతోషించింది.

"మరి రామారావుగారికి వాగ్దాన మిచ్చానన్నావు కదా, ఈ పెళ్ళి కెలా ఒప్పుకున్నావ్'' అనడిగాడు కేశవరావు.

"ఒరేయ్ నీ పెళ్ళి ఇప్పటికే ఆలస్యమైంది. ఇంకా ఆలస్యమైపోతుందేమోనని అలా అన్నాను. వెయ్యి అబద్ధాలాడి ఒక ఇల్లు నిలబెట్టమన్నారు. నే నాడింది ఒక్క అబద్ధమే'' అందావిడ.

అందరూ నవ్వారు.

"ఆలస్యం అమృతమ్......'' అని కేశవరావు అనబోతుంటే

"అమృతమే మిగిలింది!'' అంది విమల. మళ్లీ అంతా నవ్వారు. ★

పామొలీవ్ లవెండర్

హుందాగాను...అందముగాను...

వుండు మనోహరమగు సువాసన!



ఇవి యిప్పుడు మీకు పామొలీవ్ టాల్కులో లభించును. కొంచెము పామొలీవ్ లవెండర్ మీ చర్మము మీద చల్లుకొన్నచో, ఉత్తేజపరచే సువాసన మీ చుట్టూ వెదజల్లును. పామొలీవ్‌ను వాడి ఎల్లప్పుడూ తాజాగాను, ఆహ్లాదముగాను వుండండి.

పామొలీవ్ డీలక్సు-17 విదేశీ సువాసనలుగల మిశ్రమము!

PT. G. 6. TEL